ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
ఆదివారం 25 ఆగస్టు 2024 | 5



9 వసతిగృహాలు మూసివేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24: సంరక్షణ ప్రమాణాలు పాటించని తొమ్మిది వసతిగృహాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. వాటిలో ఉన్న 129మంది బాలలను ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చేర్పించాలని ఆయన సూచించారు. జిల్లాలో స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా అనధికారంగా బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డ్రాగన్ సాగు... భలే బాగు!



జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో డ్రాగన్ ఫ్రూట్ తోట



పిటాయ సాగు.. ఇలా అంటే ఎవరికీ తెలియదు. డ్రాగన్‌ఫ్రూట్ సాగు అంటేనే తెలుస్తుంది. వాస్తవానికి పిటాయా మొక్కకు కాసే కాయను డ్రాగన్‌ఫ్రూట్ అంటారు. ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే పండే డ్రాగన్‌ఫ్రూట్ పంట ఇప్పుడు మన ప్రాంతంలోను పండుతోంది. పోషక విలువలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ పండు ధర అధికంగా పలుకుతుంటుంది. ఈ పంటకు వాణిజ్యపరమైన డిమాండ్ పెరగడంతో మన దేశంలోను దీని పెంపకంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పంటకు అనుకూలమైన వాతావరణం ఉండడంతో జిల్లాలోని మెట్ట ప్రాంతంలో కూడా ఈ సాగు చేపడుతూ డ్రాగన్‌ఫ్రూట్స్‌ను పండిస్తున్నారు. పలుచోట్ల జిల్లాలోని జగ్గంపేట మండలంలో స్థానికంగా ఓ రైతు ఈ సాగు చేపడుతున్నారు. దీనిపై ప్రత్యేక కథనం..

- మెట్టలో విదేశీ పండు.. డ్రాగన్ ఫ్రూట్ పంట
- జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో సాగు
- మొత్తం పదెకరాల్లో రెండు దశల్లో సాగు
- ఎకరానికి రూ.10లక్షల వరకు వ్యయం
- ఏటా రూ.లక్షల్లో ఆర్జించే అవకాశం
- మేడమిద్దెలపైనా డ్రాగన్ మొక్కల పెంపకంపై ఆసక్తి

జగ్గంపేట రూరల్, ఆగస్టు 24:

పిటాయా ఎక్కడినుంచి..

పిటాయా అనేది కాక్టస్ కుటుంబంలో ఒక జాతి మొక్క. దీని శాస్త్రీయనామం హైలోసరస్ అంటాడస్.. పిటాయాకు కాసే కాయలను డ్రాగన్‌ఫ్రూట్స్ అంటారు. ఇది ఒకప్పుడు మెక్సికో, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా దేశాల్లో మాత్రమే పెరిగేది. ఇప్పుడు ఇండోనేషియా, తైవాన్, వియత్నాం, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, మలేషియా, బంగ్లాదేశ్‌తో పాటు దక్షిణ భారతదేశం, ఇంకా పలు దేశాల్లోను సాగు చేస్తున్నారు.

సాగు విధానం.. అనుకూలతలు..

డ్రాగన్‌ఫ్రూట్ పంట సాగుకు నీటి లభ్యతతోపాటు ఎండ కూడా ఉండాలి. తేలిగ్గా నీరు ఇంకిపోయే నేలలు అవసరం. ఇలాంటి వాతావరణం మన జిల్లాలోను ఉంటుంది కాబట్టి ఇక్కడ ఈ పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. పొలం మొత్తం అడుగు దూరంలో ఫెన్సింగ్ స్తంభాలు వేయాల్సి ఉంటుంది. వాటి వద్ద ఈ మొక్కలు నాటి స్తంభానికి తాడుతోగానీ, తీగతోగానీ కట్టాలి. మొక్క నాటిన తర్వాత నేల అనుకూలత ప్రకారం ఆరునెలలు లేదా ఏడాదినుంచి పూత ప్రారంభమవుతుంది. అలా డ్రాగన్‌ఫ్రూట్ కాయలుగా మారి రైతులకు సిరులు కురిపిస్తాయి.

హెక్టారుకు రూ.30వేల ప్రోత్సాహం

మొదటిసారిగా జగ్గంపేట మండలంలో ఈ డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. నరేంద్రపట్నంలో నాలుగు హెక్టార్లలో ఈ పంటను రైతు సుబ్బారావు సాగు చేస్తున్నారు. ఏ వాతావరణంలోనైనా ఈ పంట పడడం దీని ప్రత్యేకత. డ్రాగన్ ఫ్రూట్ ఒక పండు బరువు 300 గ్రాముల నుంచి 1000 గ్రాముల వరకు ఉంటుంది. చీడపీడలు, తెగుళ్లు ఈ పంటకు పెద్దగా ఉండవు. మొదటి రెండేళ్ల తర్వాత పూర్తిస్థాయి క్రాప్ వస్తుంది. ఈ పంట సాగుకు ముందుకు వస్తే సంవత్సరానికి రూ.30వేల చొప్పున రెండేళ్ల పాటు ప్రభుత్వ ప్రోత్సాహం ఇస్తాం.

-లావణ్య, హార్టీకల్చర్ హెచ్‌వో, జగ్గంపేట మండలం



ఎకరానికి రూ.10లక్షల వరకు పెట్టుబడి: రైతు సుబ్బారావు

మా కుమారుడి ఆలోచనకు అనుగుణంగానే మొదట్లో ఈ సాగును చేపట్టాను. మొదటిదశలో రెండు హెక్టార్లలో ఈ పంట వేశాను. మలిదశలో ఇంకో రెండు హెక్టార్లలో ఈ పంట వేశాం. పూర్తిగా ఆర్గానిక్ పద్ధతి ద్వారా మాత్రమే పండిస్తున్నాను. ఈ పంట సాగుకు ఎకరానికి రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. తర్వాత సంవత్సరానికి రూ.50వేల నుంచి రూ.70వేల వరకు అవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్నుకు రూ.1.30లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు ధర పలుకుతోంది. ఒక్కోసారి టన్ను రూ.2 లక్షల దాటి కూడా పలుకుతుంది. దివాన్‌చెరువు వద్ద పండ్ల మార్కెట్‌కు ఈ సరుకును హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నాం. కొందరు వ్యాపారులు నేరుగా వచ్చి సరుకు పట్టుకెళ్తున్నారు. ఎవరైనా ఈ పంట సాగుకు ఆసక్తి చూపితే మా వద్ద ఈ పంట విత్తనం లభిస్తుంది.

డ్రాగన్ పోషకాలు.. చేసే మేలు

డ్రాగన్ పండ్లలో అనేక పోషకాలు మెండుగా ఉంటాయి. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ సీ, కాలిష్యం, ఐరన్, మెగ్నీషియం వంటి విలువైన పోషకాలు కూడా ఉంటాయి. రక్తహీనత, మధుమేహం నివారణ, బరువు నియంత్రణకు కూడా ఇది ఉపయోగపడుతోందని పలు పరీక్షల్లో తేలింది. దీనికి క్యాన్సర్ రాకుండా అడ్డుకునే లక్షణం కూడా ఉండొచ్చని భావిస్తున్నారు. అందువల్ల మార్కెట్లో ఈ మధ్యకాలంలో ఈ పండుకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు కూడా ఈ పంటను సాగు చేసేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు.

జిల్లాలో సాగు

జగ్గంపేట మండలం నరేంద్రపట్నంలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఒక డాక్టర్ కలిసి 20 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. ఇందులో పదెకరాల్లో రెండు దశల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను పండిస్తున్నారు. నిరంతరం పంటను పర్యవేక్షిస్తూ కొత్త మెలుకువలతో సమయానికి నీరు, ఎరువులు అందించి పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ఇప్పుడే దిగుబడి మొదలైందని, రాబోయే రెండు, మూడు నెలల్లో దిగుబడి పూర్తిస్థాయిలో వస్తుందని రైతు సుబ్బారావు తెలిపారు. మొదట్లో ఎలా ఉంటుందో, పండుతుందో లేదో అనుకున్నామని, కానీ దిగుబడి ఆశాజనకంగానే ఉండేలా ఉందని ఆయన చెప్పారు.

మేడమిద్దెపైనా డ్రాగన్ ఫ్రూట్

ప్రత్తిపాడు, ఆగస్టు 24: మేడమిద్దెపైనా కొందరు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ప్రత్తిపాడులోని సీఆర్పీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ తన మేడ మిద్దెపై ఈ సాగు చేపడుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌లో ఔషధ గుణాలు అధికంగా ఉండడంతో ఇంటి అవసరాల కోసమే తాను ఈ సాగు చేపట్టానన్నారు. చిన్నచిన్న కుండీల్లో డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కల పెంపకం చేపట్టారు.



మేడమిద్దెపై డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న రాంజీ ప్రసాద్

రేపటి ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమం రద్దు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24: ప్రజాసమస్యలు పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక సోమవారం శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా రద్దు చేశామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలి పారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ అర్బన్, ఆగస్టు 24: ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించడానికి క్రీడాప్రాధికారసంస్థ జిల్లా కార్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గతేడాది ఆగస్టు 24 నుంచి ఈ ఏడాది అదే తేదీ మధ్య పోటీల్లో పతకాలు సాధించినవారు, ఖేలోఇండియా క్రీడాకారులు, స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నవారు, వెటరన్ క్రీడాకారులు దరఖాస్తులు ఈనెల 26లోగా డీఎస్‌ఏ కార్యాలయంలో స్వయంగా వచ్చి అందజేయాలని డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు.

డీఎస్‌ఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడోత్సవాలు

ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 26 నుంచి 31 వరకు వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో 26న క్రీడా ప్రతిజ్ఞతోపాటు ఫన్‌గేమ్స్, పిల్లలకు హాకీ పోటీలు, 27న వివిధ క్రీడల్లో 18ఏళ్లపైబడిన అన్ని వయసుల క్రీడాకారులకు పోటీలు, 28న పాఠశాలలు, జూనియర్ కళాశాలల బాలబాలికలకు వివిధ క్రీడా పోటీలు, 29న జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా వెయ్యిమంది క్రీడాకారులతో ర్యాలీ, వివిధ క్రీడా కార్యక్రమాలు, 30న వివిధ ఆటల్లో సెమీఫైనల్స్ పోటీలు, 31న వివిధ క్రీడల్లో గెలుపొందినవారికి బహుమతి ప్రదానోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సీఈవో తెలిపారు.

27 నుంచి ఎస్‌ఏ పరీక్షలు


కాకినాడ రూరల్, ఆగస్టు 24: ఈనెల 27 నుంచి సెల్ఫ్‌ఎసెస్మెంట్(ఎస్‌ఏ) పరీక్షలు జరుగుతాయని ఫార్మేటివ్ ఎసెస్మెంట్ పేరు సెల్ఫ్ ఎసెస్మెంట్‌గా మారిందని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. 1 నుంచి 8వ తరగతుల వరకూ సీబీఏ పద్ధతిలో ఓఎంఆర్‌లతోను, 9, 10 తరగతులకు రెగ్యులర్ పద్ధతిలో నాన్ సీబీఏ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా పేపర్లు కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే ఇస్తారని, ప్రైవేట్ పాఠశాలలకు ఏవిధమైన ప్రశ్నాపత్రాలు ఇవ్వడంలేదని తెలిపారు. ఈ పరీక్షలు సెప్టెంబరు 4తో ముగుస్తాయని, 1 నుంచి 5 తరగతులకు సెప్టెంబరు 2, 6నుంచి 10వతరగతికి 4వరకూ జరుగుతాయన్నారు. వివరాలకు డీసీఈబీ కార్యాలయంలో సంప్రదించాలని డీసీఈబీ వెంకట్రావు సూచించారు.

మెగా జాబ్‌మేళాలో 729మందికి ఉద్యోగాలు

- పిఠాపురానికి తరలివచ్చిన నిరుద్యోగులు

(ఫైల్)

కీలక స్థానాల కోసం.. పైరవీలు



- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ
- ఆదాయ వనరులు ఉన్న చోటే డిమాండ్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24: ప్రభుత్వం సాధారణ బదిలీలకు పచ్చజెండా ఊపడంతో తాము కోరుకున్న చోట పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. ఆదాయ వనరులు పుష్కలంగా ఉండే మండలాల్లో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేలవద్ద ఉద్యోగులు సిఫార్సు లేఖలకోసం క్యూకడుతున్నారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ జరుగుతున్నాయి. ఈనెల 19 నుంచి 31 లోపు బదిలీల క్రతువు పూర్తి చేయనున్నారు. విద్యాశాఖ, వైద్యులకు మినహాయించి మిగిలిన 15శాఖల్లో ఉద్యోగుల బదిలీలకు సర్వం సిద్ధమవుతోంది. ప్రధానంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, పంచాయతీరాజ్‌శాఖల్లో ఉద్యోగులు కీలక పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సు లేఖల కోసం వారి కార్యాలయాలవద్ద క్యూకడుతున్నారు. ప్రధానంగా కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం, పెద్దాపురం, తుని, తొండంగి, సామర్లకోట, జగ్గంపేట, గండేపల్లి మండలాలు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మండలాల్లో ఆదాయ వనరులు పుష్కలంగా ఉండడంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, మైనింగ్ వంటివి జరుగుతున్నాయి. దీనివల్ల ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని పలువురు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు మేజర్ పంచాయతీలు, నగరానికి సమీపంలో ఉండే పంచాయతీల్లో పోస్టింగ్‌కు ప్రయత్నిస్తున్నారు. పైగా ఇటీవల ఆర్థిక సంఘం నిధులు కూడా వచ్చాయి. దీంతో వారి ప్రయత్నాలు మరింత ముమ్మరంగా సాగుతున్నాయి.

సచివాలయ ఉద్యోగాలు మ్యూచువల్

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పదవీకాలం ఐదేళ్లు పూర్తి కాలేదు. అక్టోబర్ 2వ తేదీకి ఐదేళ్లు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో తప్పనిసరిగా బదిలీ చేసే అవకాశం లేదు. దీనివల్ల ఉద్యోగులు మ్యూచ్‌వల్ పద్ధతిలో బదిలీలు జరుగుతాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన ఉద్యోగులపై ప్రజాప్రతినిధులు ఆరాతీస్తున్నారు. అలాంటి వారిని దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అధికారుల కోసం ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

సిఫార్సులతో కమిటీలకు ఒత్తిడి

జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ఉద్యోగులను బదిలీ చేసేందుకు కమిటీ నియమించారు. దీనిలో కలెక్టర్ కమిటీకి నోడల్ అథారిటీ కల్గి ఉంటారు. తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు కమిటీలో మెంబర్లుగా ఉన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కన్వీనర్‌గా ఉండి బదిలీలపై కసరత్తు చేస్తున్నారు. జిల్లా పరిధిలో బదిలీలకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జేసీ మెంబర్‌గా, డీఆర్వో కన్వీనర్‌గా ఉండి కసరత్తు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫార్సు లేఖల వల్ల కమిటీలకు ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం.

బదిలీల మినహాయింపు హర్షణీయం

- ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్, ప్రధాన కార్యదర్శి

కాకినాడ సిటీ, ఆగస్టు 24: ఏపీ జేఏసీ అమరావతి విజ్ఞప్తి మేరకు జీవో నెంబర్ 76 ద్వారా 2025, మార్చి 31లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులందరికీ ప్రస్తుత సాధారణ బదిలీలనుంచి మినహాయింపు ఇస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఏపీజేఏసీ అమరావతి కాకినాడ జిల్లా చైర్మన్ పితాని త్రినాథ్, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ అన్నారు. ఈ ఉత్తర్వులు వెలువడడంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రట రీ ఎం.రవిచంద్ర, ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూష్‌కుమార్ విశేషకృషి చేశారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత ఇసుక పంపిణీ సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా కమిటీ నిర్ణయించిన రవాణా చార్జీలు అమలు
- జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో జేసీ రాహుల్ మీనా



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఉచిత ఇసుక పంపిణీకి సంబంధించి జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు సక్రమంగా అమలు చేయాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక విధానం-2024 అనుసరించి జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని శనివారం కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెద్దాపురం స్టాక్ పాయింట్ వద్ద ఏడు వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఉచిత ఇసుక పంపిణీకి సంబంధించి జిల్లాలో ప్రభు త్వం నిర్ణయించిన ధరలు సక్రమంగా అమలు చేయాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక బుక్ చేసుకునేలా కొన్ని స్టాక్ పాయింట్లను గుర్తించి త్వరలోనే తెలియపరుస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, డీడీ మైన్స్ నరసింహారెడ్డి, ట్రాన్స్‌పోర్టు అధికారులు లారీ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ నిర్ణయించిన ఇసుక రవాణా చార్జీలు

వాహనం	బరువు	దూరం	చార్జీ
ఒక ట్రాక్టరు	5టన్నులు	10 కి.మీ వరకు	రూ.600
		11-20కి.మీ	రూ.1200
		21-30 కి.మీ	రూ.1750
		31-40 కి.మీ	రూ.2300
6టైర్ల గూడ్స్‌క్యారేజ్	10టన్నులు	10 కి.మీల వరకు	రూ.1000
		11-20 కి.మీ	రూ.2000
		21-30 కి.మీ	రూ.2900
		31-40 కి.మీ	రూ.3800
		(అదనంగా ప్రతి టన్నుకి రూ.7చార్జీ)	
10టైర్ల గూడ్స్‌క్యారేజ్	18టన్నులు	10కి.మీ వరకు	రూ.1620
		11-20 కి.మీ	రూ.3240
		21-30 కి.మీ	రూ.4680
		31-40 కి.మీ	రూ.6120
		(అదనంగా ప్రతి టన్నుకి రూ.7చార్జీ)	
12టైర్ల గూడ్స్‌క్యారేజ్	20 టన్నులు	10కి.మీ	రూ.1800
		11-20 కి.మీ	రూ.3400
		21-30 కి.మీ	రూ.5200
		31-40 కి.మీ	రూ.6800
		(అదనంగా ప్రతి టన్నుకి రూ.7చార్జీ)	

ఉధృతంగా వెదుళ్లగడ్డ వాగు

(ఫైల్)

- తుని-నర్సీపట్నం రహదారిపై రాకపోకలకు అంతరాయం
- రౌతులపూడిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏటికాలువ

అలరించిన నృత్య నీరాజనం

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 24: శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 24 గంటల నృత్య నీరాజనం కళాభిమానులను అలరించింది. కాకినాడ సినిమారోడ్డులోని సూర్యకళామందిరంలోరెండురోజులపాటు ఆనెం లక్ష్మణరావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న నృత్యనీరాజనం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఎస్‌ఆర్ స్కూల్స్ వ్యవస్థాపకులు కాకర్ల రామకృష్ణ-భార్గవి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీఈపీడీసీఎల్ డీఈ కొత్తపల్లి నందా రాంబాబు- దుర్గాభవాని దంపతులు నటరాజ పూజ నిర్వహించారు. అదిగో అల్లదిగో- భం భజే భజే.. శివస్తోత్రంతో నృత్యవిద్యార్థినులు ప్రదర్శించిన అభినయం అందరినీ ఆకట్టుకుంది. గ్రూప్, సోలో విభాగాల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాభినయం చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు నాట్యాచార్య టీవీఎన్ వర ప్రసాద్, హరిలోకేష్ శర్మ, ఎస్.కృష్ణకుమార్, ఆనెం ప్రసాద్‌తో నాట్య గురువులు పాల్గొన్నారు.

ఆనెం లక్ష్మణరావు పురస్కారం ప్రదానం

ప్రముఖ నాట్యగురువు నాట్య విదుషీమణి పార్వతి రామచంద్రన్‌కు ఆనెం లక్ష్మణరావు జీవితకాల స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కాకినాడ సూర్యకళా మందిరంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆమెను సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ఆర్ట్ అండ్ సైన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరమణరావు, గానకళ సంపాదకులు మునుగంటి వెంకట్రావు, నాట్యాచార్య డి.హేమసుందర్, పంతం పద్మనాభం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బుర్రా పద్మనాభం పాల్గొన్నారు.



కాకినాడ సూర్యకళామందిరంలో నృత్యప్రదర్శన నిర్వహిస్తున్న నృత్య కళాకారిణులు

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 24: దేశ సమగ్రత, అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్న బీజేపీ సిద్ధాంతాలపై ప్రజల వద్దకు వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కాకినాడ విద్యుత్తునగర్ చల్లా కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఉంటుందని, సెప్టెంబర్ 1 నుంచి సభ్యత నమోదు ప్రారంభమవుతుందని అన్నారు. అనంతరం పురందేశ్వరిని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, కాకినాడ ఇన్‌చార్జి రావూరి సుధా, వై.మాలకొండయ్య, ముత్తా నవీన్ కృష్ణ, దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, మట్ట గంగరాజు, కాళ్ల ధనరాజు, ఎ.వెంకటేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

అర్ధరాత్రి గంజాయి ముఠా కోసం
పోలీసుల చేజింగ్

- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- చేజింగ్‌లో కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు
- డ్రైవర్ సూర్యనారాయణది రాజానగరం





కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం... పోలీసుల అదుపులో కారు డ్రైవర్ సూర్యనారాయణ

నెల్లూరు(క్రైం)/వెంకటాచలం/మర్రిపాడు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లో చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ నెల్లూరు జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్ట పడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు తృటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకు ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు.

● 3 గంటలు టెన్షన్.. టెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు మూడు గంటలపాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపుకాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ బాషా, పోలీసులపైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందున కోనసముద్రం గ్రామం వైపు తెల్లవారుజామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు రవాణా చేస్తున్న గంజాయి ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.



రామన్నపాలెం జంక్షన్ వద్ద పట్టుబడిన గంజాయి బస్తాలు

813 కిలోల గంజాయి స్వాధీనం

గోకవరం, ఆగస్టు 24: బొలెరో వాహనంలో రవాణా చేస్తున్న 813.590 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గోకవరం ఎస్ఐ వీఎస్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. గంజాయి రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ శివారు గ్రామమైన రామన్నపాలెం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బొలెరో ట్రక్ వాహనంలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో గంజాయిని లెక్కించగా 25 ప్లాస్టిక్ గోనె సంచుల్లో 813.590 కిలోలు ఉన్నట్టు నిర్ధారించారు. దీని విలువ రూ.40,67,950 ఉంటుందని, నిందితుల ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కేసులో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



పట్టుకున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా

350 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఆగస్టు24: ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాలతో చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్ పోస్టు వద్ద మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని (టీఎస్ 07యూఏ 3969) ఆపి తనిఖీ చేయగా 350 కిలోల గంజాయి, 100 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఒడిశాలోని కుర్మనూరుకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకు చెందిన అన్వార్ అలీ సయ్యద్, యూనుస్ ముస్తాఫ్ షేక్ గంజాయికొని మోతుగూడెం గ్రామ శివారులోని అడవిలో దాన్ని ఈ వాహనంలోకి లోడ్ చేసి మహారాష్ట్రలోని లాతూర్‌కి తరలిస్తుండగా పట్టుకున్నామని అడిషనల్ ఎస్పీ చెప్పారు. ఒడిశాకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకి చెందిన సతీష్‌లు పరారీలో ఉన్నారని, పట్టుకున్న గంజాయి విలువ రూ.17,60,00 విలువ ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చింతూరు సర్కిల్‌లో మొత్తం 16 కేసులు నమోదు చేసి, 43 మందిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 1670 కేజీల గంజాయిని, 23 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 24: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి సుమతి జగడం తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

పాదగయలోనూ పూజలు

పిఠాపురం, ఆగస్టు 24: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జె.సుమతి శనివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు హైకోర్టు జడ్జికి క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ హైకోర్టు జడ్జికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం జడ్జి పిఠాపురంలో నిర్మించిన కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సబ్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, అదనపు జడ్జి వంగా వెంకట అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ పాల్గొన్నారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

భక్తవత్సల గోవింద!

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 24: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కాగా వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 24: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,700 అన్నదాన విరాళాలు రూ.57,488 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.7,080, తులాభారం ద్వారా రూ.750, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా రూ. 18,990 వెరసి రూ.2,04,008 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వి.శ్రీనివాసరావు తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.94 లక్షలు

మామిడికుదురు, ఆగస్టు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,94,143 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని మొత్తం 2,693 మంది దర్శించుకున్నారు. 1,875 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అన్నదానానికి ఆదుర్రు గ్రామానికి చెందిన పంతాడి కామేశ్వరవర్మ-పద్మలత దంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

వచ్చే నెల 14న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 15 కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఆ రోజున ఉదయం పది గంటల నుంచి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక బెంచ్‌లలో విచారణ పెండింగ్‌లో ఉన్న సివిల్, ప్రమాదాలు, బ్యాంకు కేసులతోపాటు రాజీకి అర్హమైన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు, చదవడం, రాయడం రాని వారు కూడా నేరుగా ఆయా కోర్టు ప్రాంగణాల్లో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయ సహాయం అందజేస్తారన్నారు. లోక్ అదాలత్‌లో కేసును పరి ష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకూ సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే గంధం సునీత ఒక ప్రకటనలో కోరారు.

గాడిద పాలు తాగితే.. రోగాలు తగ్గుతాయా!?



వీధుల్లో గాడిద ను వెంటబెట్టుకుని పాలు అమ్ముతామని తిరుగుతున్న వ్యక్తి

ఉబ్బసం, దగ్గు, నడుమునొప్పులు పోతాయని అమ్మకాలు

తెలంగాణ నుంచి వచ్చి రాజమహేంద్రవరంలో విక్రయాలు.. కప్పు గాడిద పాలు రూ.300

కేవలం ఇది నమ్మకమే తప్ప శాస్త్రీయత లేదంటున్న వెటర్నరీ డీడీ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24: గాడిదలా పెరిగావు..? పనికిరాని గాడిద..? పూర్వం ఖాళీగా తిరిగే వాళ్లను మన పూర్వీకులు అనే మాటలివి.. ప్రస్తుతం ఈ మాట అనడానికి ఎవ్వరూ సరిపోరు. ఎందుకంటే నేటి తరం గాడిదలూ పనికొస్తాయని నిరూపించారు. అదెలాగంటే.. కొన్ని రకాల రోగాలకు గాడిద పాలు పనిచేస్తాయని తెలియడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది. గాడిద పాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందినవారు గాడిదలను పెంచుతూ వాటిని తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో 15 రోజులు ఉండి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7:30 గంటల మధ్య వీధుల వెంబడి తిరుగుతూ స్వయంగా గాడిదలను తీసుకువచ్చి కప్పు వరకు పిండి వాటిని విక్రయిస్తున్నారు. శనివారం రాజమహేంద్రవరంలో చిన్నగ్లాసు రూ.200, టీ కప్పు రూ.300 లకు విక్రయించారు. గాడిద పాలు ఉబ్బసం, దగ్గు, కఫం, నడుము నొప్పులకు చాలా మంచిదని ఆ పాలు అమ్మేవారు చెబుతుండడంతో డిమాండ్ బాగా పెరిగింది. సగటున రోజుకు ఐదు కప్పుల గాడిద పాలు అమ్మడం కనిపించింది. వాస్తవానికి గాడిద రోజుకు 100 మిల్లీలీటర్ల పాలు మాత్రమే ఇస్తుంది. కానీ ఇక్కడ వీళ్ళు విక్రయించే పాలు చూస్తే 200 ఎంఎల్ ఉంటుంది కానీ ప్రజలు అవేమి ఆలోచించకపోవడం గమనార్హం. అయితే కొన్ని రకాల మందుల తయారీలో గాడిద పాలు వినియోగిస్తారే తప్ప నేరుగా తీసుకునే పరిస్థితి లేదనే వాదన ఉంది.

గాడిద పాలనేది నమ్మకం మాత్రమే



గాడిద పాలను తాగితే కొన్ని రకాల జబ్బులు తగ్గుతాయని అనుకోవడం ప్రజల నమ్మకం తప్పితే దానికి ఆధారాలులేవు. గతంలో నడుము పనిచేయని ముసలివాళ్ళు గాడిద మాంసం తింటే లేచిని లబడతారనే నానుడి ఉండేది. దగ్గు, కఫం వంటివి తగ్గుతాయని ప్రజలు నమ్ముతారే తప్ప దానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. పైగా రోజుకు 100 ఎంఎల్ పాలు మాత్రమే ఇచ్చే గాడిద 250 ఎంఎల్ వరకు పాలు ఎలా ఇస్తుంది. అంటే ఇప్పటికే ఆవులు, గేదేలు పాలు పెంచే ఆక్సిటోస్ ఇంజక్షన్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. అది బయట మార్కెట్‌లో అక్రమంగా అమ్ముతున్నారనే అను మానం ఉంది. ఆ ఇంజక్షన్ వినియోగించి గాడిద పాలు పెంచుకుని ప్రజలను మోసం చేసే అవకాశం ఉంది. ఇంజక్షన్ చేసిన పాలు తాగితే మోకాళ్ళ నొప్పులు వస్తాయి.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, డీడీ పశుసంవర్ధక శాఖ, తూర్పుగోదావరి జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న జలగం కుమారస్వామి

28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు

అమలాపురం టౌన్, ఆగస్టు24: కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు పొందాలనే లక్ష్యంతో ఈనెల 28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు భారతీయ కిసాన్‌సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి పేర్కొన్నారు. కొబ్బరి రైతులు తెగుళ్ల బెడదతోపాటు దిగుబడులు తగ్గిపోయి కొబ్బరికాయలకు ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగించే విధంగా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీకేఎస్ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో దక్షిణ భారతదేశానికి చెందిన కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన కొబ్బరి రైతులతో ముందస్తు సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ వ్యవస్థ వల్ల కొబ్బరి రైతులకు కలుగుతున్న మేలు, నష్టాలపై చర్చించడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై పలు తీర్మానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని ఆదేశించి నిర్దిష్ట ధరను ప్రకటించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ విధంగా కొనుగోలు వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈనెల 28న అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహనమిశ్రా, అఖిలభారత ఉపాధ్యక్షుడు పెరుమాళ్లు పాల్గొని కొబ్బరి రైతులకు మార్గదర్శకం చేస్తారన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొంటారన్నారు. సదస్సుల్లో ఆమోదించిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి బీకేఎస్ తరఫున తీసుకువెళతామని జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. సమావేశంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ, సీనియర్ నాయకులు ఉప్పుగంటి భాస్కరరావు, అడ్డాల గోపాలకృష్ణ, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, సూర్యనారాయణరాజు, అప్పారి వెంకటరమణ పాల్గొన్నారు.





లారీ ఢీకొని మృతి చెందిన ఉపాధ్యాయిని.. రాజారత్నం (ఫైల్‌ఫొటో)

కుమార్తె ఆరోగ్యం బాగాలేదని ఇంటికి వెళుతూ

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

కొవ్వూరు, ఆగస్టు 24: కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో లారీ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన బడుగు రాజారత్నం(47) దేవరపల్లి మండలం గౌరీపట్నం హైస్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె నిషితకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో 5 రోజులు మెడికల్ లీవ్ పెట్టడానికి పాఠశాలకు రాజమహేంద్రవరం నుంచి బస్సులో వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల మాష్టారు కదిరి మురళీకృష్ణప్రసాద్‌ను గౌరీపట్నం సెంటరులో బైక్‌పై డ్రాప్ చేయాలని కోరారు. గౌరీపట్నం సెంటర్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలు పుదల చేయకపోవడంతో పంగిడి సెంటర్‌లో డ్రాప్ చేయాలని కోరడంతో ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. వర్షం కారణంగా రోడ్డు పక్కన మట్టి చేరడంతో దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీ సమీపంలో బైక్ జారడంతో కిందపడిపోయారు. మురళీకృష్ణప్రసాద్ పైకిలేచి చూసేసరికి వెనుక వస్తున్న లారీ రాజారత్నం తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త వి.రాజేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.శ్రీహరి కేసు నమోదు చేశారు.

బెహ్రాయిన్‌లో మరణించిన నాగసాయి మృతదేహం స్వగ్రామానికి..



మామిడికుదురు, ఆగస్టు24: ఉపాధి కోసం పరాయి దేశం బెహ్రాయిన్ వెళ్లి అక్కడ ఆత్మహత్యకు పాల్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన నాగులపల్లి వీరవెంకటదుర్గానాగసాయి (22) మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతదేహంగా తిరిగి రావడంతో తల్లి అనంతలక్ష్మి, చెల్లి భానులక్ష్మి విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కుమారుడికి అప్పుడే నిండు నూరేళ్ల నిండిపోయ్యాయని తల్లి రోదిస్తున్న తీరు కలచివేసింది. ఈ ఏడాది జూలై 29న ఉపాధి కోసం బెహ్రాయిన్ వెళ్లిన దుర్గానాగసాయి అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ ఈనెల 17న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సాయి మృతదేహానికి శుక్రవారం రాత్రే స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు, ఆగస్టు 24: మండలంలోని ధర్మవరంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలోని ఆదర్శ విద్యాలయం ప్రాంగణంలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం చేసేందుకు గ్రామస్థులు తరలిరావాలని కోరారు. చెవి, ముక్కు, గొంతు, వినికిడి సమస్యలు, ఎముకలు, కళ్ళు, దంత సమస్యలు, రక్తపోటు వైద్య నిపుణులు వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు.

'ద్వారంపూడి జైలుకెళ్లడం ఖాయం'



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కాకినాడ సిటీ, ఆగస్టు 24: ప్రశాంత కాకినాడ నగరంలో అక్రమాలు, అన్యాయాలు, దోపిడీలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని కాకినాడ సిటీ టీడీపీ నేతలు హెచ్చరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో టీడీపీ సిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, బీసీ సెల్ అధ్యక్షుడు వొమ్మి బాలాజీ మాట్లాడారు. గత ఐదేళ్లలో ద్వారంపూడి ఎన్నో అరాచకాలు చేయడంతో పాటు దొంగ బియ్యం అక్ర మ ఎగుమతి, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారాలతో ఎంతోమంది యువ త జీవితాలను నాశం చేశారని ధ్వజమెత్తారు. 4రోజుల క్రితం సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుపై, కూటమి ప్రభుత్వంపైన గగ్గోలు పెడుతూ ద్వారంపూడి లేఖ రాయడం దొంగే తిరిగి దొంగా దొంగా అన్నట్టుందన్నారు. ద్వారంపూడి కాకినాడ పోర్టును ఎన్నో అక్రమాలకు కేంద్రంగా చేసుకుని తన వ్యాపారాలను కొనసాగించారన్నారు. త్వరలోనే ద్వారంపూడి, అతడి అనుచరుల అరాచకాలను బహిర్గతం చేస్తామన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంపై దాడి, జన సైనికులపై రాళ్లతో దాడి, టీడీపీ కార్యకర్తల ఇళ్ల కూల్చివేత వంటి ఎన్నోదౌర్జన్యాలకు పాల్పడిన ద్వారంపూడికి ముందుంది ముసళ్ల పండుగన్నారు.

ఉల్లి ధరలను నియంత్రించాలని ధర్నా

గొల్లప్రోలు, ఆగస్టు 24: పెరుగుతున్న ఉల్లి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. రోజురోజుకి ఉల్లి ధరలు పెరిగిపోతున్నాయని, వ్యాపారులు గోడౌన్లల్లో ఉల్లి నిల్వలు ఉంచి రేట్లు పెంచుతున్నారని నాయకులు ఆరోపించారు. ఉల్లితో పాటు కూరగాయలు ధరలు పెరుగుతున్నాయని, ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక అందరికి అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, గుడాల చార్లిస్, వేగిశెట్టి గణేష్, కేశవరపు వీరబాబు, గొర్ల శివ, నాగమళ్ల శంకర్, మాదేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు'

పెద్దాపురం, ఆగస్టు 24: ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు చర్యలు చేపట్టాలని తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ మండల విద్యాశాఖాధికారులు, హెచ్ఎంలను ఆదేశించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యా నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం మండల పరిధిలోని విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల జాబితా రూపకల్పనకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు అందరికీ ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని, అనర్హులు జాబితాలో నమోదుకాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతీ క్లయిము, అభ్యంతరాన్ని ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆయన కోరారు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

జగ్గంపేట, ఆగస్టు 24: రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ అంశాన్ని బయటకు తెచ్చారని మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ ఆరోపించారు. జగ్గంపేట షాదీఖానాలో శనివారం మీడియా సమావేశంలో దళిత నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ విజయవాడలో ఆదివారం సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సిద్దంతుల కొండబాబు, ఏనుగుపల్లి కృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాతా సుబ్రహ్మణ్యం, దళిత ప్రజా చైతన్యం వ్యవస్థాపకుడు మురారి రవికుమార్, ఆర్పీఐ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులి ప్రసాద్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు,నీలపల్లి అప్పారావు పాల్గొన్నారు.

'రెవెన్యూ యంత్రాంగానికి సహకరిస్తాం'

కాకినాడ సిటీ, ఆగస్టు 24: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ యంత్రాంగానికి సంపూర్ణంగా సహకరిస్తామని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ మీనాను జిల్లా అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ విభాగాల ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జేసీ స్పందిస్తూ ఉద్యోగులకు తమ తరపున పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, స్పోర్ట్స్ సెక్రటరీ నాయుడు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు శివ, కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం, ఆగస్టు 24: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో ఈనెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు కార్యక్రమం నిర్వహించనున్నట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా నిర్వహించే ఈవ్రతాల్లో పాల్గొనే మహిళలకు దేవస్థానం తరపున లక్ష్మీదేవి రూపు, రవిక, పూజా సామగ్రీ ఉచితంగా అందచేయడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 9908683913, 9989651940, 9000488945 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రత్తిపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సత్యదేవుని సన్నిధిలో ఈనెల 30న నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సత్యదీక్ష ప్రచార కర్త శనివారం ప్రత్తిపాడు, ధర్మవరంలో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంచారు. వ్రతాల్లో మహిళలు అరటిపండ్లు, కొబ్బరికాయ, పువ్వులు తీసుకోవాలని మిగిలినవి దేవస్థానం సమకూర్చుస్తుందని తెలిపారు.

వన్నెపూడి గ్రామసభ ఘర్షణలపై కేసులు నమోదు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 24: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్, జనసేన వర్గాల మధ్య జరిగిన వివాదంపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరు తమపై దాడి చేసి గాయపరిచారని ఇరువర్గాల వారు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. టెంట్ ఊచతో దాడి చేయడంతో తన కంటి కింద తీవ్ర గాయమైందని సర్పంచ్ వర్గానికి చెందిన కందా రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులతో పాటు మరికొందరిపై, తనతో పాటు కందా వీరాస్వామి, ఆలమూరి శివాజీలపై దాడి చేసి గాయపరిచారని జనసేన వర్గానికి చెందిన మొయిళ్ల బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందితో పాటు మరికొందరిపై గొల్లప్రోలు పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు.

ఒకే రోజు నాలుగు రోడ్డు ప్రమాదాలు

గండేపల్లి, ఆగస్టు 24: గండేపల్లి మండల జాతీయ రహదారిపై శనివారం ఒక్కరోజే నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కేవలం తాళ్ళూరు గ్రామంలోనే 3 ప్రమాదాలు జరిగాయి. ఉదయం తాళ్ళూరులో కారు సడన్‌గా ఆగడంతో వెనుక వచ్చిన కారు ఢీకొట్టింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సాయంత్రం తాళ్ళూరు హనీ దాబా ఎదురుగా ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. గండేపల్లి శివారు పోలవరం కాలువ వద్ద వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. అదేవిధంగా రాత్రి 10.30 సమయానికి తాళ్ళూరు సెంటర్‌లో ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఒకే రోజు ప్రమాదాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళనలో ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసం అభిరుచులపై అవగాహన

జేఎన్టీయూకే, ఆగస్టు 24: వర్సిటీలోని అలుమ్ని ఆడిటోరియంలో శనివారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అభిరుచులపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఉపకులపతి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి మనిషి జీవిత కాలపు విద్యార్థి అని జ్ఞానేశ్వరంతో మనం ప్రపంచాన్ని చూడాలన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ రిజిస్ట్రార్ ... 'నా ప్రయాణం' అనే అంశంతో తన జీవితంలో జరిగిన సంఘటనలను వివరించారు. మాజీ ఉపకులపతి జీఎస్ఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్ రత్నకుమారి, విద్యార్థులున్నారు.

మెగా జాబ్‌మేళాలో 729మందికి ఉద్యోగాలు

పిఠాపురానికి తరలివచ్చిన నిరుద్యోగులు



జాబ్‌మేళాకు తరలివచ్చిన యువతీ యువకులు



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న దృశ్యం

పిఠాపురం, ఆగస్టు 24: పిఠాపురంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 729మందికి ఉద్యోగాలు లభించాయి. ఎస్ఎఫ్ఎస్ స్కూలు ఆవరణలో వికాస ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నియోజకవర్గం నుంచే గాక జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 2,790మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. 40 కంపెనీల్లో ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు రాత ప రీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాటి ఆధారంగా కంపెనీల్లో రూ.15వేల నుంచి రూ.40వేల వరకూ జీతం లభించే ఉద్యోగాలకు 729మందిని ఎంపిక చేసి నియామాక ఉత్తర్వులు అందజేశారు. జాబ్‌మేళాకు తరలివచ్చిన వారికి జనసేన నేతలు గొల్లపల్లి పెదబాబీ, అన్నందేవర పట్టాభి భోజన సదుపాయం కల్పించారు. వారిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. పిఠాపురంలో జాబ్‌మేళాను వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ నిరంతరాయంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పిఠాపురంలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎంపికైన యువతీ, యువకులకు ఎంపీ, జేసీ నియామాక ఉత్తర్వులు అందజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, వికాస పీడీ లచ్చారావు, మున్సిపల్ కమిషనరు కనకారావు, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి పాల్గొన్నారు.

జాబ్‌మేళాను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సందర్శించి యువతతో మాట్లాడారు.

ఏలేశ్వరంలో జాబ్‌మేళా

ఏలేశ్వరం, ఆగస్టు 24: ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో 20మంది ఉద్యోగాలు సాధించారు. శనివారం ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో బెంగుళూరు సుప్రజిత్ ఇంజనీరింగ్ లిమిటెడ్, బాగ్ బాస్కట్, చెన్నై మదర్ సన్ సుమి వైరింగ్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు మురళి, చిన్న రాజన్న ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 70మంది నిరుద్యోగులు పాల్గొనగా వారిలో 20మంది ఉద్యోగాలకు ఎంపికకాగా సునీత నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రయాగమూర్తి, వీరభద్రరావు, కుమారి, మేరి, పుష్ప, సతీష్ తదితరులు ఉన్నారు.

పంటలపై తెగుళ్లు గుర్తింపు



దుర్గాడలో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 24: రైతులు సాగు చేస్తున్న పలు పంటలపై తెగుళ్లు ఆశించినట్టు వ్యవసాయశాస్త్రవేత్తలు గుర్తించారు. మండలంలో దుర్గాడ, తాటిపర్తి గ్రామాల్లో పెద్దాపురం ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఎమ్.రామభద్రరాజు, డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్ పర్యటించి వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. పత్తి పంటపై గులాబి రంగు కాయ తొలుచు పురుగులు, రసం పీల్చు పురుగులు గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. వరిలో పొటాష్ లోప నివారణకు ఎకరానికి 20కిలోల పొటాష్ వేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్నపై కత్తెర పురుగు, బ్యాక్టీరియా కాండం కుళ్లు తెగులు ఆశించినట్టు గుర్తించామని తెలిపారు. కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి, కాండం కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి,ఏవో సత్యనారాయణ, వీఏఏలు ఉన్నారు.

కత్తిపూడిలో పొగలు



కత్తిపూడి శివార్లలో దట్టమైన పొగలు

శంఖవరం, ఆగస్టు 24: కత్తిపూడి శివార్లలో నిల్వ ఉంచిన థియోలిన్ క్లోరైడ్ ద్రవణం నుంచి పొగలు రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. ఊరంతా పొగలు వ్యాపించడంతో ఏదో జరిగిపోతుందని భయాందోళన చెందారు. అన్నవరం ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పొగలను అదుపుచేశారు. సిమెంట్‌లో వినియోగించే థియోలిన్ క్లోరైడ్ నుంచి ఈ పొగలు వచ్చినట్టు నిపుణులతో మాట్లాడి పోలీసులు నిర్ధారణ చేశారు. దీనిని రవాణా చేసే లారీ మరమ్మతులకు గురికావడంతో ఇక్కడ దిగుమతి చేశారని, అయితే నీటికి పొగలు వ్యాప్తించే లక్షణం ఈ ద్రవణానికి ఉంటుందని, ఉదయం నుంచి వర్షం పడడంతో పొగలు వ్యాప్తించాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నవరం ఎస్ఐ పేర్కొన్నారు. అడిషనల్ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రమణబాబు, రెడ్డి తదితరులున్నారు.

కొండబాబును కలిసిన డీఎస్పీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

కాకినాడ సిటీ, ఆగస్టు 24: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రఘువీర్‌విష్ణు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే, డీఎస్పీ నగర పరిస్థితులపై చర్చించారు. భవిష్యత్ కార్యచరణపై ఎమ్మెల్యే సూచనలు చేశారు. యువగళం పాదయాత్ర మొదలు, సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అద్భుత విజయం సాధించే వరకు టీడీపీ సభ్యుల కృషి మరువలేనిదని, వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంలో మన టీడీపీ యాప్ ముందంజలో ఉందని ఎమ్మెల్యే కొండబాబు అన్నారు. మన టీడీపీ యాప్ ద్వారా టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా షేర్ చేసి ఉత్తమ ర్యాంకులో నిలిచిన సిటీ నియోజకవర్గ పార్టీ నాయకులకు ప్రశంసాపత్రాలందజేశారు.

'చిక్కాల'కు సత్కారం

కాకినాడ సిటీ, ఆగస్టు 24: టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావును ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఐక్య కాపునాడు వ్యవస్థాపక కన్వీనర్ పబ్బినీడి శ్రీవెంకటేశ్వరరావు కాకినాడలో శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కాపులు రాజ్యాధికారం దిశగా పయనించాలని కోరారు. కార్యక్రమంలో కాపు సంఘాల కోఆర్డినేటర్ కేవీఆర్ నాయుడు, తిరుమలశెట్టి మురళి శ్రీనివాస్, పవన్, సాయి, శ్రీను ఉన్నారు.

దుర్గమ్మ గుడి స్థలం ఆక్రమణ

కొత్తపల్లి, ఆగస్టు 24: మండలంలో నాగులాపల్లి గొల్లపేటలో సుమారు 4దశాబ్దాల కిందట కనకదుర్గమ్మ నిర్మించిన గుడి శిథిలావస్థకు చేరడంతో మార్చిలో గుడిని తొలగించారు. అదే స్థలంలో గ్రామస్థులు, దాతల సాయంతో నూతంగా ఆలయ నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. ఆలయం పక్కనే ఉంటున్న వ్యక్తులు ఆలయం నిర్మాణ స్థలాన్ని ఇటీవల ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారు. దీనిపై పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తక్షణం చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉధృతంగా వెదుళ్లగడ్డ వాగు





కోటనందూరు: తుని-నర్సీపట్నం రహదారిపై ప్రవహిస్తున్న నీరు, రౌతులపూడిలో ఏటికాలువ

కోటనందూరు, ఆగస్టు 24: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి సరిహద్దులో గల తుని-నర్సీపట్నం రహదారిపై వెదుళ్లగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శనివారం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 2గంటల పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నాతవరం, కోటనందూరు ఎస్ఐలతో పాటు తహశీల్దార్ సుభాస్ ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను పంపించారు. జగన్నాథపురంలో లెక్కల సన్యాసినాయుడికి చెందిన గేదె బందుగడ్డలో కొట్టుకుపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదనవ్యక్తం చేశాడు.

ఉధృతంగా ఏటికాలువ

రౌతులపూడి, ఆగస్టు 24: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రౌతులపూడి ఏటికాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరింది. సత్రం పొలాలకు వెళ్లే ఇబ్బందులు పడ్డారు. బిబి పట్నం శివారు కునిపాత్రుడు చెరువు ఉధృతంగా ప్రవహిస్తోంది. గిడజాం- రౌతులపూడి రహదారి దుర్గాదేవి ఆలయం వద్ద రహదారిపై చెరువు నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పత్తిచేలుకు వర్షం నీరు చేరడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాలతో పత్తి చేలు నాశనమయ్యాయని ఆవేదన చెందారు.

గళమెత్తిన విద్యార్థులు, మహిళలు



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, మహిళలు

పిఠాపురం, ఆగస్టు 24: దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న అఘాత్యాలకు నిరసనగా పిఠాపురంలో విద్యార్థులు, మహిళలు గళమెత్తారు. బాదం మాదవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నుంచి ప్రదర్శనగా పాదగయ సెంటర్‌కు తరలివచ్చారు. బైపాస్‌రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మహిళలు, వైద్యులకు రక్షణ కల్పించాలని, అఘాత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, సేవ్ సేవియర్స్ అంటూ నినాదాలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్యాంబాబు, పీడీ శేషుకుమారి, పీఈటీ సత్యప్రియ, దుర్గకుమారి, రాజేశ్వరి, లీలాదేవి, విజయలక్ష్మి మహిళా సాధికారిక సమితి అధ్యక్షురాలు వనం సత్యప్రియ, విశాలాక్షి ఉన్నారు.

నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ

సామర్లకోట, ఆగస్టు 24: సామర్లకోట నూతన కమిషనర్‌గా ఏ.శ్రీవిద్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె భీమవరం మున్సిపల్ సహాయ కమిషనర్‌గా పనిచేస్తూ సామర్లకోట బదిలీ అయ్యారు. ముందుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్పను స్వగృహంలో కలిసి మొక్క అందించి అభినందించారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఇప్పటి వరకూ కమిషనర్‌గా వ్యవహరించిన జాస్తి రామారావు నుంచి బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది శ్రీవిద్యకు పూల మాలలతో స్వాగతం పలికి అభినందించారు. కాగా సామర్లకోట కమిషనర్‌గా పనిచేసి గుంటూరుకు బదిలీ అయిన జాస్తి రామారావుకు వీడ్కోలు సత్కారం చేశారు.



ఎమ్మెల్యే రాజప్పను కలిసిన కమిషనర్ శ్రీవిద్య

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

తుని రూరల్, ఆగస్టు 24: టీడీపీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన తునికి చెందిన కీలక నేతలతో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనపై చర్చించారు. ప్రణాళికాబద్ధంగా తుని పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని యనమల తెలిపారు. ఇప్పటికే రూ.1.5కోట్ల నిధుల మంజూరుతో ప్రారంభమైన అభివృద్ధి పనులు పురోగతిపై సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోపు పనులు ముగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇనుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, నార్ల రత్నాజీ, తటపర్తి రాజా, సిద్దాంతపు సత్తిబాబు, మళ్ళ గణేష్‌లతో పాటుగా మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.

'నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు'

కరప, ఆగస్టు 24: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి హెచ్చరించారు. కరప మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె గ్రామాలవారీగా పొందుపరిచిన నివేదికలపై బహిరంగ సమీక్ష జరిపారు. ఆయా గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లకు పించన్లను అందజేసినట్టు గుర్తించామని డీఆర్పీలు వివరించారు. ఈ తప్పిదాలకు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందిని బాధ్యులను చేస్తూ అధికారులు రూ.31వేలు అపరాధ రుసుము విధించారు. రూ.43,381 రికవరీ చేయాలని ఆదేశాలు జారీచేశారు. పీఆర్ పనులపై రూ.1,500లను రికవరీ చేయాలని సూచించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, డ్వామా ఏపీడీ పాల్గొన్నారు.





తునిలో శ్రీకృష్ణుడికి చిన్నారుల పూజలు, గొల్లప్రోలు రూరల్:చేబ్రోలులో వేడుకలు

పలుచోట్ల కృష్ణాష్టమి వేడుకలు

తుని రూరల్, ఆగస్టు24: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్న బాలవనం నుంచి 2వ తరగతి విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఈ విద్యార్థులు కృష్ణుడిని పూజించి వెన్నమీగడను నైవేద్యంగా సమర్పించి ఉట్టికొట్టే సంబరాలు నిర్వహించారు.

సామర్లకోట: సామర్లకోటలోని ప్రతిభ విద్యాసంస్థల అవరణలో లయన్స్ ఫాస్ట్ ప్రెసిడెంట్ ఎస్వీవీ.సుధారాని అధ్యక్షతన కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

గొల్లప్రోలు రూరల్: చేబ్రోలులోని గౌతమి హైస్కూలులో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు నృత్యాలు చేశారు.

27 నుంచి కృష్ణాష్టమి మహోత్సవాలు

పిఠాపురం, ఆగస్టు 24: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 29 వరకూ కృష్ణాష్టమి మహోత్సవాలు జరుగనున్నాయి. 27న స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం విశేష పుష్పార్చన, 29న ఉదయం మాస కల్యాణం, రాత్రి 7గంటలకు ఉట్ల సంబరం, అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి. పిఠాపురంలోని భాష్యం, శ్రీచైతన్య స్కూలులో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

విద్యార్థులు జీవితాలు పాడుచేసుకోవద్దు : డీఎస్పీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

గండేపల్లి, ఆగస్టు 24: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు పాడుచేసుకోవద్దని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి అన్నారు. ఆమె శనివారం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, మత్తుపానియాల జోలికి వెళ్లి జీవితాలు పాడుచేసుకోవద్దన్నారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుకోవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ శివనాగబాబు ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల పరిశీలన

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 24: కాకినాడ అర్బన్ పరిధిలో దుమ్ములపేట-1, దుమ్ములపేట-3లో 51, 51 అంగన్‌వాడీ సెంటర్లను అడిషనల్ ఎస్ఎస్‌పీ స్పాన్సర్ చేసిన ప్రింటింగ్, మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. పిల్లల వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలకు నెలకు 25 చిక్కీలు, 200 ఎంఎల్ అమూల్ నెయ్యి అందిస్తా మన్నారు. జీఎం ఆచంట దుర్గాప్రసాద్, డిప్యూటీ మేనేజర్ జెట్టి రాజు, డిప్యూటీ జీఎం అనిత,శిశుసంక్షేమాధికారిణి ప్రవీణ ఉన్నారు.

'పూడికతీత చేపట్టాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 24: ప్రత్తిపాడులో అస్తవ్యస్తంగా మారిన మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు డ్రైన్ల పూడికతీత చేపట్టాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను శనివారం ఎంపీడీవో ఎంవీఆర్‌కుమార్‌కు వినతి అందజేశారు. గ్రామంలో అనేక చోట్ల డ్రైన్ల మీద స్లాబ్ బిళ్ళలు దెబ్బతిన్నాయని దీని వల్ల వర్షపునీరు, మురుగునీరు కలిసి వీధుల్లో ముంచెత్తుతున్నాయని, అంటువ్యాధులు ప్రబలే అవకాశంఉందని సమస్యను పరిష్కరించాలని కోరారు.

వ్యవసాయాధికారి తనిఖీలు

జగ్గంపేట, ఆగస్టు 24: కాండ్రేగుల గ్రామంలో లైసెన్స్ లేకుండా పురుగుమందులు, ఎరువులను కిరాణాషాపులో అమ్ముతున్నారని వచ్చిన ఫిర్యాదు ఆధారంగా శనివారం మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరాం తనిఖీ చేశారు. ఎటువంటి పురుగుల, ఎరువులు గాని దొరకలేదన్నారు. ఎవరైనా రైతులు, పురుగుల మందులు కొనాలంటే లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుక్కోవాలని, బిల్లు తీసుకోవాలన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

పెద్దాపురం, ఆగస్టు 24: మండలంలోని కట్టమూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 139 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ నవీన్, వీఎల్వో అచ్చియ్య, ఈశ్వర్, కొంగర శరత్, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఏలేశ్వరం, ఆగస్టు 24: చైతన్యనగర్ కాలనీకి చెందిన దుందుర్తి సూరిబాబు, పూజితల తాటాకిల్లు కాలిపోవడంతో ఆ కుటుంబానికి శనివారం వివేకానంద సమితి, సాయి శంకర్ నేత్రాలయం, అమృత లేబొరేటరీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, రూ.10వేలు నగదు అందజేశారు. సిరిపుడ్స్ అధినేత పెచ్చేటి కృష్ణ, మైరాల నాగేశ్వరరావు, అనసూరి నాగేశ్వరరావు, తుండూరు రాము, గొల్లపూడి గణేష్ పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

జగ్గంపేట, ఆగస్టు 24: మల్లిశాల గ్రామ శివారున రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావుకు వచ్చిన సమాచారం మేరకు శనివారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7100 స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

పలువురికి సత్కారం

సామర్లకోట, ఆగస్టు 24: ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడి ప్రతిభ కనబర్చిన గొంచాల చిన్నారి జీవన్‌కుమార్, అలాగే ఇటీవల బదిలీ అయిన ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ప్రభుత్వ పురస్కారం అందుకున్న బొమ్మిరి రాధ, కోటి ప్రసన్న దుర్గామెహెర్‌లను శనివారం సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో పలువురు అధికారులు సత్కరించి అభినందించారు.

భారీ వర్షం

ప్రత్తిపాడు, ఆగస్టు 24: ప్రత్తిపాడులో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో కుండపోత వర్షం కురిసింది. మండల గ్రామాలు భారీ వర్షాలకు చిత్తడిచిత్తడిగా మారాయి.

కిర్లంపూడి: కిర్లంపూడిలో శనివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి.